www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 11 డిసెంబర్ 2025



ఉత్తరీయాలూ ఉత్తుత్తివే..!

■ టీటీడీలో ఆలస్యంగా వెలుగు చూసిన మరో భారీ మోసం ■ నకిలీ పట్టు వస్త్రాలతో రూ.55 కోట్ల దోపిడీ

> రాను రాను.. పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల కుంభకోణాలకు నిలయంగా మారుతోంది. ఒక్కో మోసం వెలుగు చూస్తున్న వైనం భక్తులను విస్మయానికి గురి చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేపిన కల్తీ నెయ్యి వ్యవహారం, పరకామణి చోరీ కేసులు ఓ కొలిక్కి రాకనే మరో చేతివాటం ఆలస్యంగా వెలుగు చూసింది. విశిష్ట అతిథులకు ఇచ్చే ఉత్తరీయాల్లోనూ నకిలీల మాయాజాలం.. భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్న దెవరో..? దేవ దేవుడి సొమ్మును దోచుకుంటున్నదెవరో..? కలియుగ ప్రత్యక్ష దైవానికే తెలియాలి.

ప్రజాశక్తి - తిరుమల : తిరుమల తిరుపతి దేవస్థానంలో మరో సంచలన అవినీతి కుంభకోణం వెలుగులోకి వచ్చింది. దాతలు, వేద ఆశీర్వచనంలో పాల్గొనే భక్తులు, ముఖ్య అతిథులకు ప్రత్యేక దర్శనం సందర్భంగా అందించే 'పట్టు సరిగ దుప్పటా'(ఉత్తరీయాలు) కొనుగోలులో దశాబ్ద కాలంగా భారీ మోసం జరిగినట్లు టీటీడీ పాలక మండలి గుర్తించింది. పట్టు శాలువలకు బదులుగా పాలిస్టర్ దుప్పట్టాలను సప్లై చేసి రూ.55 కోట్ల మేర టీటీడీని మోసం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును పూర్తి విచారణ కోసం ఏసీబీకి అప్పగించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశాలతో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం సప్లై అవుతున్న దుప్పట్టాలు, టెండర్ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేయడంతో మోసం బయట పడింది. టెండర్ నిబంధనల ప్రకారం ప్రతి దుప్పట్టా 100 శాతం స్వచ్ఛమైన మల్బరీ పట్టుతో, 20/22 డెనియర్ సిల్క్ నూలుతో తయారు చేయబడాలి. కనీసం 31.5 డెనియర్ కౌంట్ కలిగి ఉండాల్సి ఉంటుంది. ప్రతి ఉత్తరీయంపై ఒక వైపు సంస్కృతంలో, మరొక వైపు తెలుగులో 'ఓం నమో వెంకటేశాయ' అలాగే శంఖు, చక్ర నామాలు ముద్రించబడి ఉండాలి. అయితే తాజా విజిలెన్స్ తనిఖీల్లో సరఫరా అయిన దుప్పట్టాలు పట్టు కాదని తేలింది. ఈ దుప్పట్టాలను నగరికి చెందిన విఆర్ఎస్ ఎక్స్‌పోర్ట్ అనే సంస్థ టిటిడికి సరఫరా చేస్తోంది. ఈ సంస్థ చాలా ఏళ్లుగా టిటిడికి వివిధ రకాల వస్త్రాలను సరఫరా చేస్తోంది. విఆర్ఎస్ ఎక్స్‌పోర్ట్, దాని అనుబంధ సంస్థలు 2015-2025 మధ్యకాలంలో టీటీడీకి దాదాపు రూ.54.95 కోట్ల విలువైన వస్త్రాలను సప్లై చేసాయని విజిలెన్స్ నివేదికలో తేలింది. తాజాగా.. పట్టు వస్త్రాల శాంపిల్స్‌ను బెంగళూరు, ధర్మవరంలోని సెంట్రల్ సిల్క్ బోర్డ్ ప్రయోగశాలలకు పంపగా.. రెండు ల్యాబ్స్ కూడా వాటిని 100 శాతం పాలిస్టర్‌గా తేల్చాయి. తప్పనిసరిగా ఉండాల్సిన పట్టు హాలోగ్రామ్ ట్యాగ్ కూడా వాటిపై లేదని గుర్తించబడింది. ఈ మోసాన్ని టీటీడీ ఛైర్మన్ నమ్మక ద్రోహంగా అభివర్ణించారు. బాధ్యులపై తగిన చట్టపరమైన చర్యలు ఉంటాయని వెల్లడించారు. ఇందులో భాగమైన అందరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని టీటీడీ బోర్డ్ అవినీతి నిరోధక శాఖను కోరింది.

నకిలీ ఉత్తరీయం

ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కరించాలి

సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైని కలెక్టర్ సందీప్ రఘు వాన్సీ, రెవెన్యూ అధికారి నరసింహులు తదితరులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిల్లాలోని డివిజనల్, మండల స్థాయి రెవెన్యూ అధికారులతో ట్రైని కలెక్టర్ సందీప్ రఘు వాన్సీ, జిల్లా రెవెన్యూ అధికారి జి నరసింహులుతో కలసి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్, వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని డివిజనల్, మండల రెవెన్యూ అధికారులు, ల్యాండ్ అండ్ సర్వేయర్లతో రెవెన్యూ అంశాలు, భూసమస్యలపై సంబంధిత అధికారులతో పిఎమ్ఎవై హౌసింగ్‌లకు సంబంధించి పోసిషన్ సర్టిఫికేట్స్, రెవెన్యూ, రీ సర్వే, ల్యాండ్ అలినేషన్, ప్రైవేట్ ల్యాండ్ 22 ఏ, ల్యాండ్ రెగ్యులరైజేషన్, అసైన్మెంట్ ల్యాండ్స్, ఇనాం, ఆర్ ఓ ఆర్ - వెబ్ ల్యాండ్, మ్యుటేషన్ ఐవిఆర్ఎస్, ఎలక్షన్స్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వివిధ సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. రెవెన్యూ, భూసమస్యలపై కోర్టు కేసులు నమోదు అవుతున్నాయని వాటిని సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలకోసం అర్జీలు పెట్టుకున్నవారికి సకాలంలో పత్రాలను అందేలా చూడాలన్నారు. కార్యాలయాలకు వచ్చు ప్రజలతో మర్యాద పూర్వకంగా మాట్లాడాలన్నారు. అధికారులపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, రోజ్ మాండ్, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్‌డిఓలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, జిల్లా ల్యాండ్ అండ్ సర్వే అధికారి అరుణ్ కుమార్, జిల్లాలోని తహసీల్దార్లు, సర్వేయర్లు, కలెక్టరేట్ సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏడు గంగల జాతర

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో బుధవారం ఏడుగంగల జాతర అత్యంత వైభవంగా జరిగింది. ఏడుగంగల జాతర నేపథ్యంలో శ్రీకాళహస్తి పట్టణం భక్తులతో కిటకిటలాడింది. పట్టణ వాసులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా ప్రతి యేటా మార్గశిర మాసంలో జరిగే గంగమ్మ జాతర సందర్భంగా కమిటీలు పోటీలు పడి అలంకరణలు చేశారు. పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధిలో ఉన్న గంగమ్మ గుడి నుంచి ఏడు గంగమ్మలు మంగళవారం అర్ధరాత్రి తర్వాత బయలుదేరాయి. పట్టణంలోని ఏడు ప్రాంతాలకు చేరుకోవడంలో ఆలస్యం జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. శ్రీకాళహస్తి దేవస్థానం తరపున ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సారెను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కూడా అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయనతోపాటు వైసీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు. రాత్రి తర్వాత ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమాలు జరిగాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆర్టీసీ బస్సులు పట్టణంలోకి రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రంలో సర్వీస్‌లోఉన్న ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులందరూ ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాయాలని ఉత్తర్వులు ఇవ్వడం సమంజసం కాదని, దీన్ని వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ సంఘం డిమాండ్ చేసింది. బుధవారం ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు స్థానిక పుతూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం స్థానిక ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, డివిజనల్ కన్వీనర్ దాసరి మునెయ్య, జిల్లా సహాధ్యక్షులు ఎల్లంటి గీతమ్మ, జిల్లా కార్యదర్శి శేఖర్ లు పాల్గొన్నారు.

ఓటర్ల తొలగింపు.. రక్తపాతం లేని రాజకీయ నరమేధం

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఓటర్ల జాబితా నుంచి పౌరులను తొలగించడమంటే రక్తపాతం లేకుండా చేసే రాజకీయ నరమేధమే నని ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ ఆరోపించారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవ సందర్భంగా బుధవారం ఉదయం తిరుపతిలోని టౌన్ క్లబ్ హాల్‌లో పౌరచైతన్య వేదిక తిరుపతి జిల్లా అధ్యక్షులు వాకా ప్రసాద్ అధ్యక్షత జరిగిన పౌర చైతన్య వేదిక ప్రథమ రాష్ట్ర సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పైన చెప్పు విసినా ఒక్కరుకూడా రోడ్డెక్క లేదని గుర్తు చేశారు. ఈ విషయం హోం మంత్రికి కానీ, న్యాయ శాఖా మంత్రికి కానీ అసలు పట్టిందాని ప్రశ్నించారు. జరుగుతున్న రాజకీయాలను వినోదంగా చూడడం కాదు. కార్యరంగంలోకి దిగాలని పిలుపునిచ్చారు. ఇది వరకు ఓటు హక్కు ఎలా ఉందో, అలా ఉంటేనే ఎన్నికలకు వెళతామని పౌరులంతా అడగాలని కోరారు. చొరబాటు దారులను ఏరి వేయడానికి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఏర్పాటు చేశామని చెపుతున్న ఎలక్షన్ కమిషన్‌కు ఎవరు పౌరులో, ఎవరు పౌరులు కాదో తేల్చే బాధ్యత దానికి ఎవరిచ్చారని 'సెంటర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమాక్రటిక్ రైట్స్ అండ్ సెక్యులరిజం(సిపిడిఆర్ ఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి రుంచె శ్రీధర్ ఈ సదసులో ప్రసంగిస్తూ ప్రశ్నించారు. ఎలక్షన్ కమిషన్ తప్పులపైన తప్పులు చేస్తోందని గుర్తు చేశారు. వేదిక కర్నూలు అధ్యక్షులు ఓంకార్ వివాదాస్పదమైన కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ, తిరుపతి జల్లా కార్యదర్శి ఏ.ఎన్. పరమేశ్వరరావు పెగాసెస్ వైరస్‌ను పోలిన సంచార సాథి యాప్‌ను వ్యతిరేకిస్తూ పెట్టిన తీర్మానాలను సభ ఆమోదించింది.

బాలాజీ కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట, రజిక కాలనీలో అనారోగ్యంతో మరణించిన బాలాజీ అనే యువకుడి కుటుంబానికి కూటమి నాయకులు నాయుడుపేట పట్టణ టిడిపి అధ్యక్షులు ఎస్కే రఫీ, సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, పట్టణ టిడిపి నాయకులు నెలవల రాజేష్ ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. నాయుడుపేట రజక కాలనీకి చెందిన బాలాజీ అనే యువకుడు గత కొంతకాలంగా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెదాడు. శోకసంద్రంలో ఉన్న ఆ కుటుంబానికి ఎస్ కే రఫీ, ఉయ్యాల.ప్రవీణ్, నెలవల.రాజేష్ అండగా నిలిచారు. బుధవారం ఆ యువకుని తల్లికి 50 వేల రూపాయలు ఆర్థిక సాయం, నెలకు సరిపడా సరుకులు అందించారు. సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆ యువకునికి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి సీఎం రిలీఫ్ ఫండ్ 3 లక్షల రూపాయలు అందించారని గుర్తు చేశారు.

విశ్వం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి యస్వీయు ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు డ్రాయింగ్, ఎలోక్యూషన్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విశ్వం హై స్కూల్, జీవకోన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శిస్తూ అనేక విభాగాల్లో అగ్రస్థానాలు సాధించారు. శ్రియా, మమత, రిక్విత, జోయ్ జాస్మిన్ మొదటి బహుమతులు, సంజనా, దివ్య తేజ, పద్మిని, హారిక రెండవ బహుమతులు సాధించి పాఠశాల ప్రతిష్టను మరింతగా పెంచారు. విజేతలకు ఎస్వి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నారసింహారావు బహుమతులు అందజేశారు.

సీఏ కోర్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో చార్టెడ్ అకౌంటెంట్ కోర్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీకాం విద్యార్థులకు సీఏ కోర్సు ప్రాధాన్యం, కోర్సు నిర్మాణం, పరీక్ష విధానం, ఆర్టికల్‌షిప్, భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలపై విస్తృతమైన అవగాహన అందించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్. వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షత వహించి, సీఏ వృత్తి, ప్రతిష్ఠ, అవకాశాలు, భవిష్యత్తు కెరీర్ వృద్ధిపై విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం అందించారు. తిరుపతి బ్రాంచ్ చార్టెడ్ అకౌంటెంట్ కే. బాలాజీ ముఖ్య అతిథిగా పాల్గొని, సీఏ కోర్సు నమోదు ప్రక్రియ, శిక్షణ వివరాలు, ఐసిఎఐ కార్యకలాపాల గురించి వివరించారు. చార్టెడ్ అకౌంటెంట్ జే.గోపి మాట్లాడుతూ సీఏ కోర్సు ప్రయోజనాలు, పరీక్షా వ్యూహాలు, పరిశ్రమలో ఉన్న అవకాశాలపై విద్యార్థులకు లోతైన అవగాహన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. మల్లికార్జున రావు, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సుప్రభాత సేవలో నటి శ్రియ

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో నటి శ్రియా తళుక్కుమంది. శ్రీవారి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి తిరుమలకు చేరుకుంది. తల్లి కూతురుతో కలిసి బుధవారం వేకువజామున శ్రీవారి సుప్రభాత సేవలో ఆమె పాల్గొనింది. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితుల ఆశీర్వచనం అందచేశారు.

పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు

కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరంలో దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు ఇచ్చి వసూలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య రెవిన్యూ అధికారులను ఆదేశించారు. పన్నుల వసూళ్లు తదితర అంశాలపై బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవిన్యూ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా వార్డుల పరిధిలో పన్నుల వసూళ్లపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడు తూ నగరంలో పలు వార్డుల్లో దీర్ఘకాలింగా ఉన్న పెండింగ్లో ఉన్న వాటిని గుర్తించి రెడ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అప్పటికీ స్పందించని వారి కొళాయి, డ్రైనేజీ కనెక్షన్లు కట్ చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులు తమ వార్డుల పరిధిలో తనిఖీ చేయాలన్నారు. విధి నిర్వహణలో అందరూ సక్రమంగా ఉండాలని, ఎటువంటి సమస్యలు ఉన్నా పై అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు. పన్నులు వసూళ్లలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, వివిధ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్యాస్ బిల్ కన్నా ఎక్కువగా వసూలు చేస్తే చర్యలు

గ్యాస్ బిల్ అమౌంట్ కన్నా ఎక్కువగా వసూలు చేసే గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ ఎన్.మౌర్య గ్యాస్ డీలర్లను హెచ్చరించారు. బుధవారం జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లాలోని గ్యాస్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఐవిఆర్ఎస్ పాజిటివ్ ప్రిస్క్రిప్షన్ సర్వే మీద తిరుపతి జిల్లాలో 28 మంది గ్యాస్ డీలర్లపై ఎక్కువ పాజిటివ్ కాల్స్ వచ్చాయన్నారు. డీలర్లకు సంబంధించిన గ్యాస్ డెలివరీ బాయ్స్ సిలిండర్ డెలివరీ చేసినప్పుడు బిల్ అమౌంట్ కన్నా ఎక్కువగా వసూలు చేయుచున్నారన్నారు. కావున గ్యాస్ డెలివరీ బాయ్స్ నియమ, నిబంధనలను పాటించేలా చూడాలన్నారు. ఇలాంటివి పునరావృతమయితే ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాస్టర్ ప్లాన్ రోడ్డుకు భూమి పరిశీలన

మ్యాప్ పరిశీలిస్తున్న తుడ ఛైర్మన్ దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపత టౌన్: తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి భవిష్యత్తు అవసరాలు, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి నగర చుట్టు ప్రక్కల ప్రాంతాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రోడ్డుకు భూముల సర్వే నిర్వహించారు. ప్రస్తుతం తిరుపతికి విచ్చేస్తున్న వాహనాల రద్దీని క్రమబద్ధీకరించడానికి మాస్టర్ ప్లాన్ నిర్మించడం కోసం తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తుడా సిబ్బందితో కలిసి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తుడా పరిధిలోని తిరుపతి రూరల్, చంద్రగిరి, ఆర్ సి పురం, రేణిగుంట, వడమాలపేట మండలాలను కలుపుతూ మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణానికి తుడా సిబ్బందితో కలసి సర్వే చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ, ,యస్ ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్రయ్య, ప్లానింగ్ అధికారి, తుడా అధికారులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో అంధబాలుడి ప్రతిభ

స్కేటింగ్‌లో ప్రతిభ చాటిన అంధ బాలుడు మురారి హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణానికి చెందిన అంధ బాలుడు మురారి హర్షవర్ధన్ (10) స్కేటింగ్‌లో ప్రపంచానికే స్ఫూర్తిదాయక విజయాన్ని అందించాడు. కంటిచూపు లేకపోయినా కర్ణాటక, ఆంధ్ర బోర్డర్ నంగిలి నుండి 230 కిలోమీటర్లు స్కేటింగ్ చేస్తూ ప్రపంచ రికార్డును నెలకొల్పి పుత్తూరుకు గౌరవం తీసుకువచ్చాడు. స్కేటింగ్ కోచ్ ప్రతాప్ సారథ్యంలో శిక్షణ పొందుతున్న ఈ బాలుడి అసామాన్య ప్రతిభను గుర్తిస్తూ పుత్తూరులో బలిజ అభ్యుదయ సేవా సంఘ సభ్యులు బుధవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కాపు సంఘం జాతీయ ప్రచార కార్యదర్శి పి.గోపి రాయల్, పుత్తూరు బలిజ సంఘం సీనియర్ నాయకులు, సంఘం గౌరవాధ్యక్షులు కొట్టే రాజేంద్ర నాయుడు, రాష్ట్ర బలిజ సంఘం రైతు విభాగం ఉపాధ్యక్షుడు జి. కృష్ణయ్య, సభ్యులు సత్య, ఢిల్లీ బాబు పాల్గొని బాలుడిని అభినందించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు.

శ్రీసిటీలో 'పేక్స్ ఇండియా' నీటి నాణ్యత టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి - సత్యవేడు: శ్రీసిటీలోని పేక్స్ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమ ఆవరణలో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎన్ఏబిఎల్ నీటి లేదా మురుగునీటి నాణ్యత టెస్టింగ్ ల్యాబ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, శ్రీసిటీని క్లీన్ అండ్ గ్రీన్ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే సంకల్పానికి ఇది మరో మైలురాయిగా అభివర్ణించారు. దీంతో విశ్వసనీయ నీటి పరీక్షా సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. పేక్స్ ఇండియా యండి సుదీప్ సంగమేశ్వరన్ మాట్లాడుతూ, ఈ కొత్త ల్యాబ్ 'మేక్ ఇన్ ఇండియా' ఆలోచనకు అనుగుణంగా అత్యాధునిక టెస్టింగ్ సేవలను అందిస్తుందన్నారు. సంస్థ వైస్ ప్రెసిడెంట్ గణేష్ మాట్లాడుతూ 30కి పైగా అంశాలలో నీరు, మురుగు నీరుకు సంబంధించిన సర్టిఫైడ్ టెస్టింగ్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. కాగా, నెదర్లాండ్స్‌కు చెందిన పేక్స్ ఇండియా కంపెనీ 2016లో రూ.30 కోట్ల పెట్టుబడితో శ్రీసిటీలో ఉత్పత్తి యూనిట్‌ను స్థాపించిందన్నారు. పల్ప్ అండ్ పేపర్, ఫుడ్ అండ్ బెవరేజెస్, పెట్రోకెమికల్ రంగాలకు అధునాతన రియాక్టర్ భాగాలను ఇది తయారు చేస్తుంది. ప్రస్తుతం దీనిని అనుబంధంగా ల్యాబ్ ఏర్పాటు ద్వారా టెస్టింగ్ సేవలు అందించనుంది.

డప్పు కళాకారులను ఆదుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న డప్పు కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: డప్పు కళాకారుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలని డప్పు కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో బుధవారం డప్పు కళాకారుల సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర బడ్జెట్లో డప్పు కళాకారుల సంక్షేమం కోసం నిధులు కేటాయించాలని వెంకటయ్య డిమాండ్ చేశారు. ప్రతి కళాకారుడి కుటుంబానికి గుర్తింపు కార్డులతో పాటు రెండెకరాల సాగు భూమిని పంపిణీ చేయాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో 60 శాతం రాయితీ, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జీవిత, ప్రమాద బీమాను కల్పిస్తూ కళాకారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ. 5 లక్షలు పరిహారంగా అందజేయాలని సూచించారు. కలెక్టర్ గ్రౌండింగ్ నిధుల ద్వారా డప్పు పరికరాలు కొనుగోలు చేసి ఇవ్వాలని కోరారు. మండలానికో డప్పు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, నాయకులు దేశండి అరుణాచలం, రెడ్డిపల్లి సురేష్, రాగిపాటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్వదినాల్లో విఐపి దర్శనాలు రద్దు

ప్రజాశక్తి - తిరుమల: డిసెంబర్, జనవరి నెలలకు సంబంధించి వీఐపీ దర్శనాల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. టీటీడీ. ఈ నెలల్లో పర్వదినాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఆయా రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. డిసెంబర్ 23న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, వైకుంఠ ఏకాదశి ముందు రోజైన డిసెంబర్ 29వ తేదీ డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వైకుంఠ దర్శనాలు, జనవరి 30న రథసప్తమి కారణంగా ప్రోటోకాల్ ప్రముఖులు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తెలిపింది. డిసెంబర్, జనవరి నెలల్లో పర్వదినాల ముందురోజు వీఐపీ దర్శనాలకు సంబంధించిన సిఫార్సు లేఖలు స్వీకరించబడవని తెలిపింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని సహకరించాల్సిందిగా భక్తులను కోరింది.

వేదాంతపురం రోడ్లకు మహర్దశ

■ సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 20.24 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - రామచంద్రాపురం: టిడిపి ప్రభుత్వ హయాంలోనే చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం అభివృద్ధికి మహర్దశ పట్టిందని టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు చెరుకుల పరంధామ్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం వేదాంతపురం గ్రామపంచాయతీలో కాలనీలలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని చొరవతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి, అభివృద్ధి పనులకు రూ.20 కోట్ల 24 లక్షలు నిధులు మంజూరు చేయించారని ఆయన పేర్కొన్నారు. తిరుపతి రాయలచెరువు రోడ్డు నుండి చెంచులక్ష్మి కాలనీ వరకు, కొండోళ్ళ కాలనీలో ఆరు వీధులకు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని మాజీ సర్పంచ్ చిరంజీవి రెడ్డి తెలిపారు. సీనియర్ టిడిపి నాయకులు శ్యామ్ బాబు మాట్లాడుతూ వేదాంతపురం పంచాయతీలో 3300 మీటర్ల సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రభుత్వం నుండి ఉపాధి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు చంద్ర, ప్రసాద్, సాయి, మాధవ్ శంకర్, సచిన్, రఘురామిరెడ్డి, గౌతమి కుమార్ స్వామి, సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కురుగొండ్ల ఆధ్వర్యంలో ప్రజా దర్బార్

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: భూసమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుడి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో భూముల రీసర్వే అడ్డగోలుగా నిర్వహించడంతో గ్రామాల్లో భూ తగాదాలు పెరిగాయని విమర్శించారు. రికార్డులను తారుమారు చేయడం, ఒకరి భూమిని మరొకరి పేరుమీదకు మార్చి రైతులను ఇబ్బంది పెట్టడం అప్పటి ప్రభుత్వ హయాంలో సాధారణమైందన్నారు. ఆ గందరగోళమే ఫ్రీహోల్డ్ జారీ ప్రక్రియ ఆలస్యానికి కారణమని పేర్కొన్నారు. భూ సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా పకడ్బందీ చట్టం ప్రభుత్వం తెస్తుందని చెప్పారు. డక్కిలి సమీపంలోని సంగనపల్లి వద్ద నవోదయ పాఠశాల మంజూరయ్యిందని, డక్కిలి విద్యాహబ్‌గా మారబోతోందని తెలిపారు. డక్కిలిలో పశువుల హస్టల్‌ను కూడా మంజూరు చేయించామని వెల్లడించారు. దీంతో డక్కిలి రూపురేఖలు మారనున్నాయన్నారు. చంద్రబాబు కేసులు మాఫీ చేసుకుంటారన్న, వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జ్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి వ్యాఖ్యలను ఎమ్మెల్యే ఖండించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తుపాను బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: తుపాను బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భరోసా కల్పించారు. బుధవారం ఉదయం నారాయణవనం మండలం, పాలమంగళంలో బాధిత కుటుంబాలకు ఉచిత బియ్యం, నిత్యవసర వస్తువులను జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ఆదిమూలం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపానుతో వరద నీట మునిగిన కుటుంబాలు, చేనేత కార్మికులు, మత్స్య కార్మికులను ప్రభుత్వం ద్వారా ఆదుకుంటున్నామన్నారు. ఇల్లు లేని పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ, స్థలం ఉండి ఇల్లు కట్టుకునే స్తోమత లేని వారికి ఎన్టీఆర్ గృహాలు ప్రభుత్వం ద్వారా సాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్, ఎంపిడిఒ అరుణ, గోవిందస్వామి, రాజా, సురేష్ ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బ్యారేజ్ ఆధునీకరణకు ప్రతిపాదన

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు స్వర్ణముఖి బ్యారేజ్ కం బ్రిడ్జి ఆధునీకరణకు నాలుగు కోట్ల 50 లక్షల రూపాయలతో ప్రతిపాదన పంపినట్లు జల వనరుల శాఖ ఈఈ బాబు తెలిపారు. బుధవారం శ్రీకాళహస్తి జల వనరుల శాఖ మెకానికల్ ఈఈ జనార్ధన్ రెడ్డి బ్యారేజ్‌కి చెందిన పరికరాలను పరిశీలించారు. గేట్లు, యంత్రాలు తదితర పరికరాలను పరిశీలించి అవసరమైన ఉన్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అందు నిమిత్తం నాలుగు కోట్ల 50 లక్షల రూపాయలతో మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించడం జరిగిందన్నారు. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఈఈ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక డీఈ చంద్రశేఖర్, ఏఈలు శ్రీనివాసరావు, కృష్ణయ్య సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్‌లో చేరికలు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: యుటిఎఫ్ వరదయ్యపాలెం శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపిక కాబడిన డీఎస్సీ 2025 ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు 11 మందికి సేవా పుస్తకం అందించి, యుటిఎఫ్ సభ్యులుగా చేర్చుకోవడం జరిగింది. ప్రధాన కార్యదర్శి సురేష్ భగవాన్ మాట్లాడుతూ కొత్తగా యుటిఎఫ్‌లో చేరిన ఉపాధ్యాయులకు ఆహ్వానం పలుకుతూ రాబోయే రోజుల్లో ఉపాధ్యాయుల సమస్యల పోరాటానికి వారి వంతు సహకారం అందిస్తూ, పాఠశాలలను బలోపేతం చేయాలని, సంఘం ఉన్నతికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శశి కుమార్, రుష్యేంద్ర బాబు, తిరుపతి నాయుడు, కొండలరావు, గోవిందరావు, వెంకట్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ టూర్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఫ్రెండ్స్ ఫ్రైడ్ ఫ్యాషన్ టూర్ వేగం పుంజుకుంది. మోటార్ క్రీడ, ఫ్యాషన్ ఉన్నతమైన స్పూర్తితో ఈ టూర్‌కు విశేష స్పందన లభిస్తుందని పెర్ఫార్మెన్స్ రికార్డ్ ఇండియా విశేష్ దేబార్జీ దాస్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో, స్టైల్, పవర్, మోటార్ క్రీడలు పేర్చబడిన డిజైన్, అందమైన పెర్ఫార్మెన్స్ వేర్, ఉత్సాహవంతమైన ఫ్యాషన్ ప్రదర్శనను అందిస్తున్నామన్నారు. ప్రముఖ డిజైనర్లు నమ్రత జోషిపుర, అభిషేక్ పాట్నీలు ఆల్మట ఉత్సాహవంతమైన డిజైన్లతో ఈ టూర్‌ని ఉత్సాహ పరుస్తున్నారని వెల్లడించారు. "ఫ్యాషన్, సాంస్కృతిక సంభాషణలను తీర్చిదిద్దడంలో ఫ్రెండ్స్ ఫ్రైడ్ ఫ్యాషన్ టూర్ ఎల్లప్పుడూ ముందు స్థానంలో ఉంటుందని తెలిపారు. తమను ఆదరిస్తున్న వినియోగదారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అన్న క్యాంటీన్‌లో భోజనం భేష్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని పాత బస్టాండు ప్రాంతంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను బుధవారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పేద వారికి ఐదు రూపాయలకు అందించే భోజనం ఎంతో నాణ్యతగా ఉంద'ని, ఇదే విషయాన్ని ప్రజలు చెబుతున్నారని తెలిపారు. క్యూలో నిలబడి ప్రజలతో పాటు ఆయన భోజనం రుచి చూశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, భాస్కర్ రెడ్డి, రహీమ్, శ్రీనివాసులు, మట్టం శ్రావణి, లీలావతి తదితరులు పాల్గొన్నారు. ఫ్లోర్, హర్షార్ సంధు, ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారులు ఛిద్రం.. ప్రయాణీకులూ జర భద్రం

■ వర్షాలు, వరదతో దెబ్బతిన్న రోడ్లు ■ గోతుల మయమైన రోడ్లపై వరుస ప్రమాదాలు ■ నిద్రావస్థలో ఆర్ అండ్ బి అధికారులు ■ చోద్యం చూస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: ఇంట్లోనుంచి బయటకు అడుగు పెట్టింది మొదలు తిరిగి ఇల్లు చేరేది నమ్మకం లేకుండా పోయింది. వాహనంపై బయలుదేరితే ఈ నమ్మకం మరింత సన్నగిల్లుతోంది. జనాభాకు అనుగుణంగా జరగని రహదారుల విస్తరణ సమస్యలను పెంచుతోంది. ఈ నేపథ్యంలో రహదారి భద్రతకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భారీ వర్షాలు, తుపానులతో మండలంలోని రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇటీవల వచ్చిన మొంథా, దిత్వా తుఫానులతో, కురిసిన భారీ వర్షాలతో చాలా చోట్ల ప్రధాన రహదారులు, పంచాయతీ రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగా ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

ప్రాణాలు పోతే గాని స్పందించరా..?

ప్రధాన రహదారులపై పెద్దపెద్ద గుంతలు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. మండలంలో ఎటువైపు ప్రయాణం చేయాలన్నా నరకప్రాయంగా ఉంటోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. విద్య, వైద్యం, ఉద్యోగాల వంటి అవసరాల కోసం మండలం నుండి తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట తదితర ప్రాంతాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుంతల్లో పడి ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు అనేకమని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదమరిస్తే అనంత లోకాలకే..!

వరదయ్యపాలెం-తడ మార్గ మధ్యలో సుమారు పది కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం ఉంది. రాత్రి సమయంలో ఈ ప్రాంతంలో అడవి పందులు తిరుగుతుండటంతో గతంలో అనేక రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. దీనికితోడు పెద్దపెద్ద గుంతలు ఇప్పుడు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా శ్రీ సిటీ పరిశ్రమంలో పనిచేసే కార్మికులు రాత్రి సమయంలో వారు విధులు నిర్వహించుకొని తిరుగి ఇంటికి చేరే క్రమాలో ప్రయాణమంటే హడలుతున్నారు. ఇటీవల అనేకమంది యనమాలగుంట వద్ద ఏర్పడి ఉన్న గుంతలను తప్పించబోయి జారిపడి గాయాల పాలయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారులకు మరమ్మతులు చేపట్టాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చేయండి

తీవ్రంగా దెబ్బతిన్న రహదారులకు నామమాత్రపు ప్యాచీలు వేసి సరిపెట్టకుండా, నాణ్యమైన రోడ్లను వేసి తమ ప్రాణాలు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

బాధ్యతలేని పరిశ్రమ యజమానులు

శ్రీ సిటీ, హీరో కంపెనీ, అపోలో పరిశ్రమ ఇలా అనేక కంపెనీలకు సంబంధించి ప్రతిరోజు మండల రహదారులపై కొన్ని వందల బస్సులు కార్మికులను నిత్యం తరలిస్తూ ఉంటాయి. కనీసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగానయినా రోడ్ల మరమ్మతులు చేయించడానికి వారు ముందుకు రాక పోవడం దౌర్భాగ్యమని పరిశ్రమల ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా రాయల చెరువు-అనుప్పల్లె రహదారి పనులు

ప్రజాశక్తి - రామచంద్రపురం : రాయల చెరువు - అనుప్పల్లె రహదారికి పాతికేళ్ల క్రితం తారు రోడ్డు వేశారు. అప్పటినుండి ఆ రోడ్డు అభివృద్ధి గురించి పాలకులు పట్టించుకోలేదు. మరమ్మతులకు నోచుకోక రోడ్డు వర్షాలకు గుంతలమయంగా మారింది. ఆ రోడ్లో ప్రయాణించాలంటే ప్రజలు నరకయాతన పడేవారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని నిధులు మంజూరు చేయించుకుని రాయల చెరువు కట్ట నుండి అనుప్పల్లె పంచాయతీ, నూతుగుంటపల్లి వరకు సుమారు రూ. కోటి రూపాయలతో తారు రోడ్డును పనులు చేయిస్తున్నారు. ఆర్ అండ్ బి అధికారుల పర్యవేక్షణలో రోడ్డు చురుకుగా సాగుతున్నాయి. తిమ్మరాజు పల్లి, సురావారిపల్లి, గొల్లపల్లి, తిమ్మరాజు పల్లి హరిజనవాడలలో 600 మీటర్ల మేరకు సిమెంట్ రోడ్లు నిర్మించనున్నట్లు ఆర్ అండ్ బి అధికారులు తెలిపారు. రాయల చెరువు నుండి అనుపల్లె వరకు డబుల్ రోడ్డు నిర్మించాలనే ప్రతిపాదన ఎమ్మెల్యే రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేశారు. త్వరలో టెండర్లు పిలిచి, డబుల్ రోడ్డు నిర్మిస్తామని ఆర్ అండ్ బి అధికారులు తెలిపారు.

రె నెక్స్ట్ ఎక్స్ పో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 19,20,21 తేదీలలో విజయవాడ వేదికగా నిర్వహించే ఎక్స్ పో పోస్టర్ ను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. స్థానిక ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య, టెక్నికల్ ఈఈ వాసవిలత, ఏపీ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షులు హేమ కుమార్ మువ్వల ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ భవిష్యత్తు ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని సోలార్ ఎనర్జీ వినియోగం పెరగడం అత్యవసరమన్నారు. రె నక్స్ ఎక్స్ పోలో అత్యాధునిక సాంకేతికత, సోలార్ పరికరాలు, పునరుత్పాదక శక్తి పరిష్కారాలు, పరిశ్రమలకు సంబంధించిన నవీన ఆవిష్కరణలు ప్రదర్శించ బడనున్నాయని నిర్వాహకులు వెల్లడించారు. రాష్ట్రంలోని పరిశ్రమలు, ఇంజినీరింగ్ విద్యార్థులు, గృహ వినియోగదారులు ఈ ఎక్స్ పోను పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ మెంబర్స్ బాబు నాయుడు, మణికండన్, చంద్రశేఖర్, శైలజ, తేజ కుమార్, సాంబశివరావు, రామ్మోహన రావ్, నాగరాజు, జయ బాబు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు

■ సీఎంకు ఆలయ చైర్మన్ కృతజ్ఞతలు

ప్రజాశ - తిరుపతి టౌన్: తిరుపతి, తాతయ్య గుంట గంగమ్మ ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రూ. 2.50 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఇందుకుగాను ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు బుధవారం సీఎంను మంగళగిరిలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో గంగమ్మ ఆలయ దర్శనానికి రావాలని ఆహ్వానించారు. అనంతరం ఇన్చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలసి నిధుల మంజూరుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రూ. రెండున్నర కోట్ల రూపాయలు

శ్రీ తాతయ్యగుంట ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్ల 50 లక్షల రూపాయల నిధులను బుధవారం మంజూరు చేశారు. ఆ నిధులతో ఆలయంలో భక్తులకు మరింత మెరుగైన సేవలందించేందుకు అవసరమైన పనులను చేపట్టనున్నారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయం యొక్క ఉత్తరము తూర్పు పశ్చిమ వైపులా మిగిలిన ప్రాకార గోడ నిర్మాణం పనులు చేపట్టడం, ఉత్తర, తూర్పు, పశ్చిమ వైపుల ముఖం మండపంపై అలంకార సాలహారము నిర్మాణము చేపట్టడం వంటి పనులతో పాటు మిగిలిన పనులన్నీ కూడా త్వరితగట్టిన చేపట్టేందుకు ధులు మంజూరు చేయించుకోవడంలో చైర్మన్ మహేష్ యాదవ్ సఫలీకృతులయ్యారు.

ఎమ్మెల్యేకు మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

ప్రజాశక్తి - నాయుడుపేట: సంవత్సరాల తరబడి అరకొర జీతాలతో పిల్లలకు భోజనాలు పెట్టడం సేవగా భావించి పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు న్యాయం చేయాలని మధ్యాహ్న భోజన జిల్లా కార్యదర్శి కే విజయమ్మ ఎమ్మెల్యేను కోరారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు తీర్చాలని సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ నాయుడుపేటలోని తన స్వగృహానికి వచ్చిన సందర్భంగా మధ్యాహ్నం భోజనం కార్మికులు మంగళవారం రాత్రి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనం జిల్లా కార్యదర్శి కె.విజయమ్మ మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన కార్మికుల శ్రమను గుర్తించి వారికి గౌరవ వేతనాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆ తర్వాత గత ఆరేడేళ్లుగా పట్టించుకున్న నాయకుడు లేరని ఈ మధ్యకాలంలో ప్రతి ఒక్కటి రేట్లు విపరీతంగా పెరిగిపోతున్నప్పటికీ ఎన్నో కష్టాలకు ఓర్చి పిల్లలకు నాణ్యమైన భోజనాలు అందిస్తున్నామని తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మి మాట్లాడుతూ స్కూల్లో విలీనం చేయడంతో కొంతమంది మధ్యాహ్నం భోజనం కార్మికులు ఆ కాస్త బ్రతుకుతెరువు కూడా కోల్పోయారని, కొన్ని ప్రాంతాలలో ఇస్కాన్‌కు ఈ పథకాన్ని అప్పజెప్పడంతో కార్మికులు బతుకు జీవనానికి గండి పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అ పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పచెబితే విద్యార్థులకు భోజన నాణ్యత ఉండదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్యాహ్నం భోజనం కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, ప్రమాద బీమా సౌకర్యం, పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ ప్రభుత్వ పథకాలు అమలయ్యేటట్టు చూడాలని ఎమ్మెల్యేకి విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే తప్పక న్యాయం జరిగేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి శివకవి ముకుంద, మధ్యాహ్న భోజనం జిల్లా అధ్యక్షులు ఫాజిరియా, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఈఎస్ఐ సంస్థ అందిస్తున్న వైద్య సేవలు, ఇతర ప్రయోజనాలను కార్మికులు ఉపయోగించు కోవాలని తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యాంబాబు పేర్కొన్నారు. తుమ్మలగుంట సమీపంలోని, టీటీడీ గోశాల ఆవరణలో వున్న' ఆగరుబత్తి'ల తయారీ కేంద్రంలో పనిచేసే మహిళలకు బుధవారం ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్యాంబాబు మాట్లాడుతూ ఈఎస్ ఐ ఆసుపత్రిలో మహిళలకు, చిన్న పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు, వాక్సిన్‌లు వేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరం లో 130 మందికి పైగా లబ్ధిదారులకు వైద్య సేవలు అందించగా, ఆసుపత్రి డాక్టర్లు పద్మహస్త, స్వర్ణ, గాయత్రీ, హెడ్ నర్స్ సరస్వతి, నర్సింగ్ సిబ్బంది హేమలత, పద్మజా, వినోదిని తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆపే వరకు ఉద్యమం

ప్రజాశక్తి-వెంకటగిరి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా సేకరించిన సంతకాల ప్రతులను బుధవారం వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు వైసిపి కార్యాలయం పంపే కార్యక్రమం నిర్వహించారు. నేదురుమల్లి మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు, ప్రజాసంఘాలు, సామాజికవేత్తలు అండగా నిలవడం అభినందనీయమన్నారు. ప్రైవేటీకరణ ఆపేవరకు చంద్రబాబు సర్కార్‌పై పోరాటం ఆగదని తెలిపారు. వెంకటగిరిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, వైసిపి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సమగ్ర విచారణ చేయించి అర్హులైన పేదలకు ఆ భూములు పంచుతామని తెలిపారు. పట్టణంలోని క్రాస్ రోడ్డు సమీపంలో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం స్థల కేటాయింపు వివాదం నడుస్తున్న క్రమంలో ఆ ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించి స్థానికులతో చర్చించారు. అంబేద్కర్ భవన నిర్మాణం కోసం కేటాయింపు ప్రభుత్వపరంగా జరగాల్సి ఉందని, ప్రస్తుతం తాము అధికారంలో లేని కారణంగా ఇక్కడ నెలకొన్న పరిస్థితులను జిల్లా కలెక్టర్‌కు నివేదించి సమస్యను సామరస్యంగా పరిష్కరించేలా చూడాలని కోరుతామన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రవేటీకరణ చేస్తోందని, దీన్ని నిరసిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ విజయవంతమైందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. వైకాపా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తయ్యింది. సేకరించిన ప్రతులను తిరుపతి, వైకాపా కార్యాలయానికి వాహనంలో తరలించారు. ఈ వాహనాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి సాగనంపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజలనుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. గూడూరు నియోజకవర్గం నుండి 70 వేల సంతకాలను సేకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చేవూరి విజయమోహన్ రెడ్డి, నాశిన నాగులు, మల్లు విజయకుమార్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, సంపత్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సుభాన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మెడికల్ కాలేజీలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే చర్యల పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ పేరుతో భారీ ర్యాలీలు, ఉద్యమాలు నిర్వహించింది. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీల బృందం బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ని కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ భేటీలో వైసీపీ పార్లమెంటరీ పార్టీ లీడర్ వైవి. సుబ్బా రెడ్డి, వైసీపీ లోక్ సభ ఫ్లోర్ లీడర్ మిథున్ రెడ్డి, రాజ్యసభ ఫ్లోర్ లీడర్ పిల్లి సుభాష్ చంద్ర బోస్, రాజ్యసభ ఎంపీలు మేడా రఘునాథ రెడ్డి, అయోధ్య రామి రెడ్డి, గొల్ల బాబు రావు, లోక్ సభ ఎంపీలు మద్దిల గురుమూర్తి, గుమ్మా తనూజా రాణి పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ పూర్తయిన సందర్భంగా ర్యాలీ

ప్రజాశక్తి - నాయుడుపేట: జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, కాకాణి గోవర్ధన్ రెడ్డి సూచనలతో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సూళ్లూరుపేట నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన కోటిసంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని ఆ సంతకాల సేకరణ ప్రతులను నెల్లూరు జిల్లా పార్టీ కార్యాలయానికి పంపే కార్యక్రమం సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట పట్టణం నుంచి కిలివేటి.సంజీవయ్య ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నాయుడుపేట పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి, సూళ్లూరుపేట నియోజకవర్గంలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ ప్రతులను కిలివేటి సంజీవయ్య జండా ఊపి జిల్లా కార్యాలయానికి పంపించారు. ఈ సందర్భంగా కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ ప్రజా వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకుని ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సిపి నాయకులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, మునిసిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు చదలవాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుందరం ఫైనాన్స్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సుందరం ఫైనాన్స్ తిరుపతి బ్రాంచ్ 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుందరం ఫైనాన్స్ ఆంధ్రా ప్రాంత ఉపాధ్యక్షుడు, హెడ్ ఎస్. బాలసుబ్రహ్మణియన్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో స్థాపించబడిన తిరుపతి బ్రాంచ్, తిరుపతిలో ఆర్థిక ప్రాధాన్యతను విస్తరించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. చిన్న వ్యాపార యజమానులు, మొదటిసారి రుణగ్రహీతలు, స్వయం ఉపాధి నిపుణులు, రవాణా నిర్వాహకులు ఈ బ్రాంచ్‌లో విశ్వసనీయ ఆర్థిక భాగస్వామ్యాన్ని అందిస్తుందన్నారు. బ్రాంచ్ మేనేజర్ బి.శేఖర్ మాట్లాడుతూ ఈ బ్రాంచ్ కేవలం ఆర్థిక సహాయం కోసం మాత్రమే నిలబడలేదని, పారదర్శకత, గౌరవం, మానవీయ దృక్పథం కోసం నిలబడిందని తెలిపారు. తరతరాల కస్టమర్లకు జీవనోపాధి నిర్మించడంలో, సహాయపడిందని గుర్తు చేశారు. తిరుపతి బ్రాంచ్ ప్రజాబందాలతోనే బలపడిందన్నారు. తమ సిబ్బంది నిజాయితీ, లక్ష్యంతో సేవ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు, ఉద్యోగులు, వినియోగదారులు పాల్గొన్నారు.

బ్రేక్ దర్శనాలలో టిడిపి, బిజెపిలకు వాటాలున్నాయి :చింతా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కాంగ్రెస్ పార్టీలో ఉండి తమ కుటుంబాలను అభివృద్ధి చేసుకున్న కొన్ని కుటుంబాలు కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టాన్ని చేకూర్చాయని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెహ్రూపై మోడీ చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీటీడీ ఉన్నది సామాన్య భక్తుల కోసమని, కానీ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో టీటీడీలో వీఐపీ బ్రేకు దర్శనాలను అధిక ప్రాధాన్యంలో టిడిపి, మరో ప్రాధాన్య క్రమంలో బిజెపి పొందుతుయన్నారు. న్యాయస్థానాలపై ప్రజల్లో నమ్మకం ఇను మడింప చేసేలా తీర్పులు గతంలో వచ్చేవి, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. సొంత ఇండ్లు లేని జర్నలిస్టులకు బాసటగా నిలిచి, వారి తరపున పోరాటానికి కృషి చేస్తానన్నారు.

క్రైం న్యూస్

కాలేజ్ పై నుంచి పడి విద్యార్థికి గాయాలు

గాయలపాలైన మహిధర్ రెడ్డి

ప్రజాశక్తి - చంద్రగిరి: తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, అగరాల నారాయణ కాలేజ్ విద్యార్థి మహిధర్ రెడ్డి మంగళవారం రాత్రి కిటికీ నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. హాస్టల్ నుంచి బయటకు రావడానికి పైపులు పట్టుకుని దిగుతున్న సమయంలో ప్రమాదం జరిగింది. చెవి, ముక్కు, నోటి నుంచి రక్తస్రావం అవడంతో అపస్మారక స్థితిలోకి చేరాడు. దీంతో ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. మరో ఆరుగురు విద్యార్థులు కూడా పైపులపై కనిపించగా సెక్యూరిటీ అడ్డుకున్నారు.

బయోట్రీమ్ ప్రాంగణంలో కారు దగ్ధం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని అటవీ శాఖకు చెందిన బయోట్రిమ్‌లో బుధవారం కారులో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ కారణంగా కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన ఇన్నోవా కారు దగ్ధం అయ్యింది. బయోట్రీమ్‌లో ఉద్యాన శాఖ అధికారులు రైతులకు పలు అభివృద్ధి పంటలు, తక్కువ సమయం, తక్కువ ఖర్చుతో లాభసాటి వ్యవసాయ పద్ధతులను వివరించడానికి, ప్రోత్సాహానికి ఇక్కడ కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం వరదయ్యపాలెం నుంచి కొంత మంది రైతులు ఇన్నోవా వాహనంలో బయోట్రీమ్‌కు వచ్చారు. కొద్దిసేపటికి కారు నుంచి మంటలు రావడంతో, అదుపు చెయ్యలేక అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందించగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అలిపిరి పోలీసులు ఘటన స్థలానికి వచ్చే పరిశీలించారు. ఈ కారు దగ్ధం ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.

టిడిపి నేత శ్రీనివాసులకు సత్కారం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధి, తిరుమల నగర్ పంచాయతీకి చెందిన టిడిపి నేత ఇటీవల మొదలియార్ సంఘం తిరుపతి ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ఏవీఎం శ్రీనివాసులును స్థానిక టిడిపి నేతలు ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అందుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఘన సన్మాన కార్యక్రమంలో ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ అధ్యక్షులు కల్లూరి ఈశ్వరయ్య, లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ రామంజేరి మహేశ్వరి, టిడిపి తిరుపతి రూరల్ మండల ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, టిడిపి సీనియర్ నేత అజీస్ భాష, సూరి, రణధీరపురం పంచాయతీ టిడిపి కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చంద్ర, అశోక్, నాగరాజు, సుశీల, లత తదితరులు పాల్గొన్నారు.

శ్రీపతిబాబుకు సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : నూతనంగా ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ శ్రీపతి బాబుని ఎస్వీ యూనివర్సిటీలో యువజన, విద్యార్థి నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యుడు డా. శ్రీపతిబాబు మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీతో తనకున్న అనుబంధాన్ని, తన చదువుకున్న మిత్రుల్ని తనతో పాటు పనిచేసిన విద్యార్థి ఉద్యోగాలని ఆయన కలుసుకున్నారు. తనను ఎస్సీ కమిషన్ సభ్యుడుగా నియమించినందుకు ముఖ్యమంత్రికి, నారా లోకేష్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. శ్రీపతిబాబుని సన్మానించిన వారిలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్, అధికార ప్రతినిధి రామ్మోహన్, ఎస్వీ వర్సిటీ కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ తదితరులున్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: మండలంలోని కువ్వాకొల్లిలో పంచాయితీ భవన నిర్మాణానికి నాయకులు, గ్రామ పెద్దలతో కలిసి బుధవారం శంకర్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం ఆదేశాల మేరకు రాజీ లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నందకిషోర్ రెడ్డి, మండలం టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎస్‌బిఐ చేయూత

ప్రజాశక్తి - పిచ్చాటూరు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివిధ రుణాల ద్వారా రైతులకు చేయూతనందిస్తుందని ఎస్బిఐ చీఫ్ మేనేజర్ దేవ ప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ రైతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో రైతులకు ఎస్బిఐ అందించే రుణాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ డ్రిప్, రెయిన్ గన్, స్పింకర్లు, పాల ఉత్పత్తి, డైరీ వంటి రకరకాల రుణాలు తన బ్యాంకు అందిస్తుందన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి లాభదాయకమైన వ్యవసాయం చేయడానికి రైతులకు రుణాలు అందిస్తున్నామని, వాటికి ప్రభుత్వం నుండి సబ్సిడీ వస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు బ్రాంచ్ మేనేజర్ బి.అంజద్ అలీ, ఎస్బిఐ లైఫ్ మేనేజర్ రాజేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : హక్కులతో సమాంతరంగా విధులు, బాధ్యతలను నిర్వహించాలని పుత్తూరు బార్ అసోసేషన్ అధ్యక్షులు గాలి సురేష్ బాబు పేర్కొన్నారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని, పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్సీ రాఘువేంద్ర ఆదేశాల మేరకు, మండల న్యాయ సేవ అధికారి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం, స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.

మహారాజశ్రీ గూడురు 7వ అదనపు జిల్లా జడ్జివారికోర్టులో

I.A.NO. 384/2025
O.S.No.55/2017

Kanakambedu Mallikeswara Setty (Died), and others ...**Petitioners/Plaintiff**

Vs

Eswaravaka Prabhakar Reddy (Died and others ...**Respondents/Defendants**

ఆక్షేపణ నోటీసు

To

R9: Eswaravaka Vijayasanthy, W/o. Late Prabhakar Reddy.
R10: Eswaravaka Venkat, S/o. Late Prabhakar Reddy.
R11: Eswaravaka Vikram Reddy, S/o. Late Prabhakar Reddy.
All are Residing at Racha Kandriga Village, Veerareddy Palem Mandal, Chittoor Dist

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా పై నెంబరు కేసులో ఒకటవ ప్రతివాది ఇ.ప్రభాకర్‌రెడ్డి చనిపోయినందున ఆయన వారసులుగా మిమ్మల్ని చేర్చుమని పై కోర్టులో పిటిషను పెట్టి వున్నందున మీకు నోటీసు తేది 15.12.2025న పై కోర్టులో వాయిదా వేసియున్నారు. కనుక ఆరోజున మీరుగానీ, మీ తరపున వకీలు గానీ హాజరై పై కోర్టులో ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు
శ్రీ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి
పిటిషనర్/వాది తరపు వకీలు
నెల్లూరు

హెల్మెట్ వాడకం తప్పనిసరి

ప్రజాశక్తి - రామచంద్రపురం : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లను ధరించి వాహనాలు నడపాలని, హెల్మెట్లు ధరించడం వల్ల ప్రమాదాలు సంభవిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చని ఎంఎస్ఎం ఈ రాష్ట్ర డైరెక్టర్ ఎన్ చిన్నబాబు పేర్కొన్నారు. బుధవారం ఆర్ సి పురం ప్రధాన కూడలి వద్ద గీతాంజలి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు, వాహన చోదకులు హెల్మెట్స్ ధరించాలని వినూతన అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు హెల్మెట్లు ధరించి పాఠశాల నుండి ఆర్ సి పురం వరకు ర్యాలీ చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపల్ మాధవి హెల్మెట్లు ధరించడం వల్ల ప్రాణాల్లో రక్షణ ఉంటుందన్నారు. ఎస్సై భక్తవత్సలం మాట్లాడుతూ 15వ తేదీ నుండి హెల్మెట్ ధరించని వాహనాలకు పెట్రోల్ బంకు యజమానులు పెట్రోలు నింపరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఈశ్వరయ్య, వెంకటేష్, సి రాజశేఖర్, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని సాంఘిక సంక్షేమ బీసీ సంక్షేమ వసతి గృహాలను బుధవారం మండల డెవలప్మెంట్ ఆఫీసర్ వెంకటరత్నమ్మ, విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎంపీడీవో వంటగది పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, ఆహార పదార్థాలను పరిశీలించారు. సిబ్బందికి రుచిగా ఆహారాన్ని అందించాలని తెలిపారు. విద్యార్థులు రోడ్లమీద విచ్చలవిడిగా తిరుగుతున్నారని, వాచ్మెన్కి సాయంకాలం ఐదు గంటలకు హాస్టల్ గేట్లు మూసివేయాలని, ఎవరినీ బయటికి పంపరాదని సూచించారు. వసతి గృహ అధికారి కూడా విద్యార్థులకు అందుబాటులో ఉంటూ అన్ని సబ్జెక్టులకు టూటర్లును నియమించాలని తెలియజేశారు.

మానవ హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకాళహస్తి సబ్ జైలు ఆవరణలో రిమాండ్ ఖైదీలకు మానవహక్కులపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క మనిషికీ స్వేచ్ఛగా జీవించే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. ఆ స్వేచ్ఛను హరిస్తే న్యాయపరంగా పోరాడి సాధించుకునే హక్కును చట్టం కల్పించిందన్నారు. చట్టాలు హక్కులపై అవగాహన కలిగి ఉంటే మానవ హక్కులకు భంగం వాటిల్లదని సూచించారు. పలువురు న్యాయవాదులు, పారా వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది ఆరవ

పార్థసారథయ్య సూచించారు. బుధవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విశ్వక్సేనారెడ్డి, హైమావతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐతేపల్లిలో వైభవంగా జాతర

గంగమ్మ జాతరలో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న చంద్రగిరిక ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి - చంద్రగిరి: ఐతేపల్లిలో నడివీధి గంగమ్మ జాతర వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతర వేడుకలను పురస్కరించుకుని ప్రముఖ పారిశ్రామికవేత్త, క్లాస్ 1 కాంట్రాక్టర్ ఏ.వి. రమణమూర్తి, మాజీ జడ్పీటిసి సరిత, ఎంపిటిసి ఏసి శేఖర్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఎంఎల్ఎ పులివర్తి నాని అమ్మవారికి సారె సమర్పించారు. గంగమ్మ జాతర వేడుకలలో గతంలో ఎన్నడులేని రీతిన అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి నుండి బుధవారం వేకువజాము వరకు నడివీధి గంగమ్మను విశేష అలంకరణతో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏవి రమణమూర్తి నివాసం నుండి సారెను తీసుకుని బయలుదేరిన ఎంఎల్ఎ మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండు భాజాలు భాణాసంచా పేళుళ్ళ నడుమ ఆలయానికి చేరుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాద ఆశీర్వాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గౌస్ బాషా, సింగిల్ విండో చైర్మన్ రాజులగారి వినోద్కుమార్రెడ్డి, మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, లోకాద్రి నాయుడు, డాక్టర్ వాసు, క్వారీ శ్రీదర్ నాయుడు, శానంటట్ల సురేష్ రెడ్డి, జయచంద్రారెడ్డి (జెసిఆర్), కన్నయ్య నాయుడు, మంగాపురం భాస్కర్ రాయల్, చంద్రబాబు, ఉస్మాన్, లతీష్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో.. నేత్రదానం గొప్పది

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - వాకాడు: అన్ని దానాలలోకి నేత్రదానం గొప్పదని ఎస్.ఏ.ఎల్. సి.ఈ.ఎఫ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడుగు ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం, వాకాడు, ముస్లిం వీధిలోని మోడల్ ప్రాథమిక పాఠశాలలో రమేష్ ఐ కేర్ కంటి వైద్య నిపుణులు వంజివాక రమేష్ నేతృత్వంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విద్యా ప్రదాత స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వర రావు, ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం కోట మండలం, చెందోడుకు చెందిన ఎం.వి.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ వంజివాక రమేష్ విద్యార్థులకు, పాఠశాల సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. సమస్యలున్న వారిని గుర్తించి కంటి అద్దాలకు, ఆపరేషన్లకు రెఫర్ చేశారు. ఈ శిబిరంలో 116 మంది విద్యార్థులు, 50 మంది వృద్ధులు పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, విద్యార్థులు, రమేష్ ఐ కేర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది, ఫౌండేషన్ కార్యదర్శి ఎం విజయలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

సమస్యలు అధిగమిస్తే సర్వతోముఖాభివృద్ధి

శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ, వెలుగు కార్యాలయంలో బుధవారం ఆదర్శ గ్రామాల ఏర్పాటుపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఏపియం మునెయ్య మొదటి రోజు శిక్షణను సమీక్షించారు. సభ్యులును మూడు గ్రూపులుగా విభజించి వారు సాధించిన విజయాలను వేలికి దారులు చుట్టుకునే ప్రక్రియతో బోధపడేలా తెలిపారు. అందరూ కలిసి ముందుకు సాగితే అద్భుతాలు చేయవచ్చునని, విభేదాలు లేకుండా ఒక్క తాటిపై నిలబడవచ్చని తెలియ జేశారు. సమస్యలు వస్తే వాటిని ఎలా అధికమించాలనేది చిక్కుముడి ఆట ద్వారా ప్రదర్శించారు. సభ్యులు ప్రలోభాలకు లోనుకాకుండా సమస్య ఏవిధంగా పరిష్కరించవచ్చో తెలియజేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, వీరజిన్న, జీవ, అకౌంటెంట్లు హిమగిరిజ, శిరీష, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

విజన్ బిల్డింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి - పిచ్చాటూరు : పిచ్చాటూరు మండలం, మండల సమైక్య కార్యాలయంలో విజన్ బిల్డింగ్‌పై శిక్షణ, డెమోన్స్ట్రేషన్‌పై బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణార్థులకు మార్గదర్శనం చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధి గ్రామీణ ఆర్థిక పురోగతికి పునాది వంటిదన్నారు. ఈ శిక్షణలో ఐబి డిపియం వెంకటేష్, ఐబి ఏపియం రాధమ్మ, హెచ్‌డి ఏపియం చంద్రబాబు తదితర అధికారులు పాల్గొన్నారు. వారు సంఘాల నిర్వహణ, ఆర్థిక లావాదేవీల పారదర్శకత, ఫండ్ వినియోగం, భవిష్యత్ ప్రణాళికలు, క్లస్టర్ లెవల్ ఫంక్షనింగ్‌లపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల మహిళా సంఘాల ప్రతినిధులు, క్లస్టర్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంప్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు 50 మంది వాలంటీర్లు స్థానిక నారాయణవనం మండలం బ్రాహ్మణ తాంగెల్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రత్యేక సేవ క్యాంపు బుధవారం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మధు, ప్రోగ్రాం అధికారి సురేష్ తెలిపారు. మూడు రోజులు పాఠశాల ఆవరణ, పురవీధుల్లో శుభ్రం చేసి ఆరోగ్యం-శు భ్రతపై అవగాహన కల్పించారు. తదుపరి 4 రోజులు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రిన్సిపాల్ జనార్దన్ రాజు, డిప్లమా ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గంగమ్మకు ఎమ్మెల్యే సారె

ప్రజాశక్తి - చంద్రగిరి : చంద్రగిరి మండలం, ఐతేపల్లిలో గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఎమ్మెల్యే పులివర్తి నాని పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారి దర్శనం అనంతరం, ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. గ్రామస్తులందరూ సుఖసంతోషాలతో జీవించాలని గంగమ్మ తల్లిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బాలకృష్ణ మూర్తి, సెక్రటరీ కొండూరు ప్రవీణ్, రమణమూర్తి, గ్రామపెద్దలు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహాయక సంఘాలకు సఖి కార్యక్రమం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలకు అన్ని మున్సిపాలిటీల్లో సఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మెప్మా డైరెక్టర్ పేర్కొన్నారు. సీఎం ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యం దిశగా స్వయం సహాయక సంఘాల మహిళలకు సఖి సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఉచిత ఆరోగ్య పరీక్షలు రేపటినుండి తిరుపతి జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని 35 సంవత్సరాలు పైబడిన స్వయం సహాయక సంఘ మహిళలు వినియోగించుకొని శారీరక మానసిక పోషక ఆహార ఆరోగ్యాన్ని కాపాడుకుని, ఆర్థిక సుస్థిరత సాధించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.